శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!!
సద్గురు సాయినాథుని శరద్బాబూజీ కీ జై!!

# గురుకృప

గురోపినతి మీ కరీ హృదయ మందిరీ యా బసా!
సమస్త జగహే గురు స్వరూప చీ ఠసో మానసా!
కరో సతత సత్కృతీ మతి హిదే జగత్పావనా!



ఓ సద్గురూ! నాహృదయ మందిరంలో నిలచి ఈ సమస్త జగత్తంతా
సద్గురు స్వరూపంగా భాసించేటట్లు చెయ్యి! ఎప్పుడూ జగత్కల్యాణ
కార్యాలు చెయ్యాలనే సద్బుద్ధిని ప్రసాదించు!

సంపుటి:1 సంచిక:4 త్రైమాసిక పత్రిక సెప్టెంబర్- 1998

సాయివంటి దైవంబు లేడోయి లేడోయి

ప్రజలందరి నోట సాయి నామం పలకాలి! సర్వత్రా సాయి రూపం రంజిల్లాలి!



ముజ్జగాలు సాయి మహిమతో
ముప్పిరి గొనాలి!
సాయిపద రవళులు మన
హృదయ కుహరంలోని
నిశ్శబ్ద నిశీధిలో
ప్రతిధ్వనించాలి.
ప్రణవనాద వీచికల్లా
సాయి జ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి!

ఆ సుజ్ఞాన సౌరభాల
ఆస్వాదనలో మన
మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు
అంతటా నిరంతరం
వర్షించాలి! ఆ ప్రేమామృత
ధారలలో తడుస్తూ, ఆ
జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ

సద్గురు
శ్రీ సాయినాథుని శరద్బాబూజీ

'సాయి వంటి దైవంబు లేడోయి! లేడోయి!!' అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి! అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం. ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీ సాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో ప్రార్థించటమే మనం చేయగలిగింది, చెయ్యవలసింది.

*************************************************************************************

## ఈ సంచికలో


1. సాయివంటి దైవంబులేడోయి!లేడోయి
2. ఉన్నమాట - అనుకున్నమాట - — గురు బంధువులు
3. అసలైన సాయిబాట అందరికీ రాచబాట — డా|| సాయినాథుని శరద్బాబూజీ [సాయిపథం నుండి]
4. నేనున్నాగా - నేచూసుకుంటా — K.V.I. అనిల్ కుమార్
5. వేచి ఉండాలి — గురుచరణదాసుడు
6. విశ్వసించినవారికి విచారమేలేదు — పెమ్మసాని రుక్మిణమ్మ
7. నేను చూసిన నా గురువుగారి యొక్క అపూర్వశక్తి — S. మోహనగుప్తా
8. ఆ చేయి ఎంతహాయి — డా|| జి. సాయివరప్రసాదరావు
9. మా ఇంట్లో భజన చెయ్యరూ! — గట్టా రత్తయ్య
10. గురువుగారికి తెలియందేముంది — పువ్వుల రామమోహనరావు
11. గురుసన్నిధిలో ఆనందమైన రోజు — గ్రంధి పద్మజ శివయ్య

# ఉన్నమాట - అనుకున్న మాట

విజయదశమికి నాల్గవసంచికగా గురుకృప పత్రిక మీ ముందుకు వచ్చింది. "సాయిపథగాములకు" విజయదశమి పర్వదినము. ది.15-10-1918న బాబా మహాసమాధి చెందారు. బాబా మహాసమాధి చెందిన రోజునే బాబా పుణ్యతిథిగా బాబా భక్తులంతా భావిస్తారు. చాలా సంవత్సరాలదాక బాబాసమాధిపై బాబా చిత్రపటాన్నుంచి ఆరాధిస్తూ వచ్చారు. ఆ తరువాత శ్రీ సాయిశరణ్ ఆనంద్ స్వామీజీ కృషి ఫలితంగా బొంబాయి వాసి "తాలిం" అను శిల్పిచే మలిచిన బాబా నిజస్వరూప రూపముగల విగ్రహాన్ని 7-10-1954 సంవత్సరంలో మహాసమాధిపై ప్రతిష్ఠించిన రోజునే మరో సజీవ సుందర చైతన్య స్వరూపం, ఆంధ్రావనిలో ప్రభవించినది. అక్కడ శిరిడీలో పునరుద్ధాన భావం, ఇక్కడ ఆవిర్భావనం, ఒకేరోజున సంభవించినవి. శివ జటాజూటం నుండి జాలువారిన శివగంగ దివినుండి భువిపైకి ప్రవహించిన విధంగా బాబా స్వరూప, స్వభావ సంప్రదాయములను పరిరక్షించు యోగిగా "సాయి సాధనా స్వరూపులుగా", శరద్బాబుగారు జనన మొందారు. మనందరికి సద్గురువులై సాయిబాటలో సాయి ఊసులో, సాయి ధ్యాసలో, తమజీవితాన్ని అంకితం చేసికొని సమస్యలతో సతమతమైపోతున్న మానవాళిని సంరక్షించుతు దారి, తెన్నూ తెలియక, జీవనతీరంలో దరికి చేరలేక అతలకుతలమైపోతున్న వారిని సక్రమమైన మార్గాన నడిపిస్తున్న మన గురుదేవుల జన్మదినోత్సవంగూడా విజయదశమిరోజునే కావటమన్నది మనందరి అదృష్టంగా భావిస్తున్నాము. బాబాతో గురువుగారిది జన్మజన్మల సంబంధమా! లేక బాబాతో తీరని అనుబంధమా? చెప్పలేము. ఏది ఏమైనప్పటికి ఈ సంచిక విజయదశమి సంచిక. గురుదేవుల సంచిక అని చెప్పక తప్పదు.

ఈ సంచికలో శ్రీ సి.హెచ్.మోహన గుప్తా గారి అనుభవము, శ్రీ పువ్వుల రామమోహన రావు గారి అనుభవములు చదివిన తరువత రెంటిలోను మనకు కన్పించేది విశ్వాసమే. సద్గురువుకు శరణాగతి చెందిన వారెవరైనా సరే! వారు కోరినను, కోరక పోయినను, వారివారి అవసరాలను సద్గురువు తీరుస్తారనే అర్థమౌతుంది. ఆనాడు బాబాచరిత్రలో వెల్లడైన విధంగానే, ఈరోజు మనగురుబంధువులంతా "గురుకృపను" పలువిధాలుగా పొందుతున్నారు. విశ్వాసము అచంచలమైతే మనం పొందలేనిదేదీ లేదను విషయము స్పష్టమౌతున్నది.

గత పది సంవత్సరాలుగా "గురులీలను" గురుబంధువుల అనుభవాలను సేకరించుతు వాటన్నింటిని ముద్రించి పుస్తరూపంలో జనబాహుళ్యానికి అందించాలని తలంచారు. గురుబంధువులు డా||జి.సాయి వరప్రసాదరావు, వారు సేకరించిన వ్రాత ప్రతులను సరిచేసినవి "గురుకృప" పత్రికకు ఇవ్వవలసినదని అడుగగా సహృదయంతో ఆనందంగా అందించారు. ఈ పత్రికకు వారందించిన వ్రాత ప్రతులు ఎంతో దోహదపడినవి. అడిగినదే తడవుగా కాదనకుండా అందరము గురుసేవచేయవలసినవారమేనని అంటూ పదిసంవత్సరాల వారికృషి ఫలాన్నంతా "గురుకృప" పత్రికకు ఇచ్చారు. వారిని గురుదేవులు సర్వదా కాపాడాలని "గురుకృప" పత్రికాముఖంగా ప్రార్థిస్తున్నాము. సర్వాంగసుందరంగా రూపుదిద్దుకొని రాబోవు "గురుకృప" జన్మదిన సంచికకై ఎదురుచూద్దామా!

గురుబంధువులు.

# అసలైన సాయిబాట - అందరికీ రాచబాట

- సాయిపథం నుండి

*"మా సంప్రదాయమే వేరు" అన్న బాబా మాటలను ఆధారంగా గ్రహించి మన గురుదేవులు* ***1988*** *సంవత్సరములో సాయిపథం పత్రికలో ఒకవైపు సందేశము, మరోవైపు వివరణాత్మకమైన వ్యాఖ్యాన విధానములో వ్యాసమును వ్రాసియున్నారు. ఈ వ్యాసములో మంత్రోపదేశము, అంటరానితనము, కులతత్త్వము, ఉపవాసము, జ్యోతిష్యాదులను గురించి వివరించుతునే "అసలైన సాయిబాటే" అందరికి రాచబాటగా ఎలా? అవుతుందను విషయాన్ని వివరణాత్మకరీతిలో విశదీకరించి యున్నారు. గురుబోధకమైన ఈ వ్యాసాన్ని ప్రతిసాయి భక్తుడు అవగతం చేసుకొని ఆపథంలో పయనిస్తే "సాయిబాటే నిజమైన రాచబాట"ను భావన హృదయగత మవుతుంది.*

*"గురుకృప"*

మౌలికమైన ఆధ్యాత్మిక సూత్రాలు ఎన్నడూ మారవు. కానీ, శాశ్వతము సనాతనముయైన ఆ ఆధ్యాత్మిక సూత్రాల ఆచరణకు 'సుళువులుగ' ఆయా దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా మహాత్ములు ఏర్పరిచిన ఆచార వ్యవహారాలు మాత్రం కాలక్రమంలో మార్పుచెందక తప్పవు! మన దేహంలో సత్త్వం కోల్పోయిన నిర్జీవకణాలు ఎప్పటికప్పుడు విసర్జింపబడి వాటి స్థానే క్రొత్తకణాలు తయారవుతూవున్నట్లు, సమాజమనే దేహంలో అంతకు ముందు ఏర్పడిన బాహ్యాచార వ్యవహారాలు కాలగతిలో అర్థరహితము, నిర్జీవము అయినప్పుడు, అవతార పురుషులయిన సద్గురుమూర్తులు ఉద్భవించి సమాజంలోని ఆ నిర్జీవ సంప్రదాయాలను తొలగించి నూతన సాంప్రదాయాలను పాదుగొల్పి, ఆధ్యాత్మికతకు ప్రాణమైన సనాతన ధర్మసూత్రాన్ని కాపాడుతుంటారు. ఇది సృష్టిధర్మం: జీవధర్మం. "సంభవామి యుగే యుగే" అని శ్రీకృష్ణుడు చెప్పింది యీ సృష్టి 'ధర్మ' సూత్రం గూర్చే! కానీ, ఆ సద్గురుమూర్తులు సమాజంలో ఆ 'మార్పులను' సాధించే ప్రయత్నం ఆయాకాలాలలో సాంప్రదాయ విరుద్ధంగాను అనాచారంగాను తోచడం సహజం. అందుకనె తాను చెప్పేది 'ఉపనిషత్తుల సారమైన సనాతన ధర్మాన్నే' నని గీతాచార్యుడు నొక్కి వక్కాణించవలసి వచ్చింది. అలాగే, "నేను సనాతన ధర్మాన్ని ధ్వంసం చేయడానికి కాదు వచ్చింది, దాన్ని పరిపూర్ణం చేయడానికే"! అని ఏసుప్రభువు ప్రకటించి, ఆయన సంస్కరణలను ప్రతిఘటించిన ఆనాటి ఛాందసులను శాంతపరచే ప్రయత్నం చేయవలసి వచ్చింది. ఆ యుగపురుషులు తమ తమ 'నూతన' మార్గాలను ఆవిష్కరించినప్పుడు అప్పటికి జవసత్త్వాలు కోల్పోయి, కేవలం యాంత్రికంగా మిగిలిన 'ఆచారవ్యవహారాలు, మతధర్మాలే' సత్యమని మూర్ఖంగా నమ్మిన ఛాందసుల నుండి ప్రతిఘటన తప్పలేదు. అప్పట్లో అలాంటి ఛాందసులే బుద్ధభగవానుని ప్రబోధాలను 'నాస్తిక పాషండమతం' గా దూషించి ప్రచారం చేసారు. ఆ వెర్రి ఎంతవరకు వెళ్ళిందంటే, బుద్ధుణ్ణి ఒక దొంగగా శ్రీరామునిచేత దూషింపచేసేంత వరకు వెళ్ళింది! 'వాల్మీకిరామాయణం': అయోధ్యకాండ (110-34)లో శ్రీరాముడు ఇలా అంటాడు: "యథా హి చోరస్య తథాహి బుద్ధః తథాగతం నాస్తిక మత్ర విద్ధి! ...." అని. అంటే, 'బుద్ధుడు ఒక చోరుడు: ఆ తథాగతుని మతం నాస్తికము: గర్హ్యము' - అని రాముడంటున్నాడు! కొంచెం ఆలోచిస్తే, ఎవడో బుద్ధిహీనుడయిన ఛాందస వైదికమతోన్మాది, శ్రీరాముడి తర్వాత ఎంతోకాలానికి బుద్ధుడు జన్మించాడనే విషయం కూడా ఆలోచించక, బౌద్ధమతంపైని ద్వేషంతో యీ శ్లోకం కల్పించి, 'వాల్మీకిరామాయణం' లో చొప్పించినాడని ఇట్టే స్పష్టమవుతుంది. కానీ, అది ప్రతిఘటనలో ఒక దశ మాత్రమే. బుద్ధుని ప్రబోధాల ప్రచండ ప్రభంజనాన్ని దూషణతో ఎదుర్కొనలేమని గుర్తించిన బుద్ధిమంతులు ఆ తరువాతి కాలంలో బుద్ధుణ్ణి విష్ణువు యొక్క తొమ్మిదవ అవతారంగా అవతారాల జాబితాలో చేర్చి,......సరి! అదొక పెద్ద కథ! ఇక ఆ విషయం వదలి బాబా విషయానికొద్దాం!

*"అమ్చా ఘరాణె నిరాళా ఆహేత్!"* 'మా సాంప్రదాయమే వేరు!" - అన్నారు శ్రీసాయిబాబా! వేరంటే, దేన్నుండి వేరు? ఈనాడు ఆధ్యాత్మికత పేరున, సనాతనసంప్రదాయం పేరున చలామణి అవుతున్న మూఢనమ్మకాలు,

దురాచారాలు, వ్యర్థ ఆచారకాండ మొదలైనవాటి నుండి వేరు! అలాంటి విశిష్టమయిన ఒక నూతన సంప్రదాయాన్ని ఈ యుగ ధర్మంగా శ్రీసాయిబాబా ప్రబోధించారు. అందుకనే శ్రీసాయిబాబా భౌతికరూపంతో సంచరించిన కాలంలో ఆయనకు ఇటు హిందూ, అటు ముస్లిం మతాలకు చెందిన ఛాందసుల నుండి ప్రతిఘటన, ప్రాతికూల్యం తప్పలేదు. ప్రచండమైన సాయి మహిమ యొక్క ప్రాబల్యాన్ని తట్టుకోలేక ఆ ప్రతిఘటన తన రూపం మార్చుకొని బాబా కూడా పరమవైదిక సంప్రదాయ ప్రవర్తకుడనే ప్రచారంగా రూపుమార్చింది. బాబా యేనాడూ మంత్రోపదేశాలు చేయలేదు. సరికదా, ఇతరుల వద్దకు మంత్రోపదేశాలకై పరుగులిడటాన్ని కూడా ఆయన అంగీకరించలేదు. అలాంటిది, ఈనాడు శ్రీసాయి పేరున 'మంత్రోపదేశాలు' చేస్తున్న గురుస్వాములు మన మధ్యనున్నారు. మడి మైల అంటరానితనం కులతత్త్వం ఉపవాసాలు మొదలైన ఆచారకాండను బాబా నిర్ద్వంద్వంగా నిరశిస్తే, ఆ దురాచారాలన్నీ యీనాడు సాయి సాంప్రదాయంలో, సాయిమందిరాల్లో చొప్పించబడటం మనం చూస్తున్నాం. 'నేనెప్పుడూ చమత్కారాలు చెయ్యను' అన్న శ్రీసాయినే తమ 'కులదైవం'గా చెప్పుకుంటూ, తమవృత్తులను నిరాటంకంగా చేసుకుంటున్న జోస్యాలరాయుళ్ళు 'ప్రశ్నల' పరమహంసలు చెట్టుకొకరు పుట్టకొకరుగా పుట్టుకొస్తూనేవున్నారు. 'సద్గురువుకు అనన్యంగా శరణాగతి' చెందమని బాబా చెప్పిన ఉపాసన, అందరి దేవతలు ఒకటేనన్న విశాలదృక్పథం 'పేరున'-శివరామకృష్ణ గణేశదత్తమారుత్యాది రూపాలతోపాటు బాబాను కూడా చేర్చి అందరినీ మూకుమ్మడిగా పూజించే పద్ధతికి మారింది. మనస్సు వివిధ రూపాలు ధరించటం మాని, ఒకే రూపం ధరించడం ద్వారా చైతన్యఘనత లేక బ్రహ్మతథాకారవృత్తి సిద్ధిస్తుందని బాబా చెప్పిన ఉపాసనా రహస్యం మరవడం వల్ల ఎందరో సాయిభక్తులు పూజామందిరాలు వివిధ దేవతా మూర్తుల చిత్రపటాల ప్రదర్శన శాలలుగా మారుతున్నాయి. సాయిభక్తులందరు వివేకంతో ఈ పరిణామాలను గమనించి, ఆత్మవిమర్శన చేసుకుంటూ, నిజమైన సాయి సాంప్రదాయమేమిటో విచారించి తెలుసుకొని ముందుకు సాగాలి! అలా ముందుకు సాగనీయకుండా అడ్డుపడే బూజుపట్టిన ఆచార వ్యవహారాలపట్ల మనకుండే మూర్ఖమైన మూఢ విశ్వాసమే మనలోని మహిషతత్త్వం. ఆ మూఢాచారాలను సమాజంలో ప్రచారం చేసేవారే ఆ మహిషతత్త్వం మూర్తీభవించిన మహిషాసురులు. మన ఆధ్యాత్మిక పురోగమనానికి నిరోధమయిన ఈ మహిషతత్త్వాన్ని ఒక రూపంలో జయిస్తే మరోరూపంలో తలెత్తుతూనే వుంటుంది, -- మహిషాసురుని ప్రతి రక్తం బొట్టులో నుండి మరో మహిషాసురుడు పుట్టి విజృంభించినట్లుగ! మనలోని త్రికరణాలను ఏకం చేసి ఒక మహిషాసురమర్దన శక్తిగా రూపొందింపజేసుకొని,సాయిభక్తి వివేకము నిష్ఠ-సబూరీలనే ఆయుధాలతో పోరాడినప్పుడే ఆ మహిషాసుర మర్దనం జరుగుతుంది. అది జరిగిన నాడే మనకు నిజమయిన విజయదశమి!

## "నేనున్నానుగా - నేచూసుకుంటా"

అడిగినవారి అవసరం, ఆర్తినిబట్టి సద్గురువు యొక్క కృపలభిస్తుంది. బాబాను పరీక్షలకు ముందు శేవడే అను విద్యార్థి పాస్ కావాలనికోరగా మిగిలినవారు గేలిచేసారు. సద్గురువు యొక్క వచనం ఎన్నడు పొల్లుపోదు. అడిగినవారిలో విశ్వాసం మాత్రం లోపించగూడదు. శరణాగతి ముఖ్యం. ఆ విద్యార్థి పరీక్షల్లో కృతార్థుడైనాడు.


కొందరు కోరికలు కోరటానికై గురువును దర్శిస్తారు. కొందరు కోరికలు తీరిన తరువాత కృతజ్ఞతను తెలియజేయుటకై గురువువద్దకు వస్తారు. అనిల్ కుమార్ "శరద్బాబూజీ" గారిని తనకోరికలు తీరిన తర్వాతనే దర్శించానని తన అనుభవాలను వ్రాత పూర్వకంగా వ్రాసి ఇచ్చారు. "నేను B.com పరీక్ష పాస్ కావటమన్నది. కేవలం "శరద్బాబూజీ" గారి దయవల్లేనని నిక్కచ్చిగా చెప్తాను. నేను చదివింది గుంటూరులో. పరీక్షవ్రాయవల్సి వచ్చిందేమో నిడుబ్రోలులో[పొన్నూరు]. నేను గుంటూరులో పరీక్ష వ్రాయాలనుకొని గురువుగార్ని ప్రార్థించి నాగార్జున విశ్వవిద్యాలయంకు అభ్యర్థన పత్రాన్ని పంపుకొన్నాను. అలా ఒక చోటునుంచి మరోచోటుకి మన అభ్యర్థనను విశ్వవిద్యాలయంకు చెందిన అధికారులు అంగీకరించాలంటే 200/-PAY చేయాలి. అలాంటిదేదీ లేకుండానే శరద్బాబూజీగారి అనుగ్రహం వల్ల గుంటూరు సెంటర్ వచ్చింది. నా స్నేహితులు Rs.200/- కట్టినా వాళ్ళను మార్చలేదు. నిడబ్రోలు సెంటరే వారికిచ్చారు.

నేను వారిని ప్రార్థించింది సెంటరు మార్చమని గదా! గురుదేవులు అంతటితోనే ఆగకుండా నాకు ఎంతో మేలు చేసారు. నాకు సిడుబ్రోలు వచ్చివుంటే ఎంతో నష్టపోయే వాడిని. జరిగిందేమంటే ఫైనల్ "బి.కాం" ఆడిటింగ్ పరీక్ష రోజున నా మిత్రులంతాకల్సి సిడుబ్రోలుకు నాల్గుగంటల ముందుగానే తెనాలి నుంచి బయల్దేరారు. ఆరోజున వారెక్కిన బండిని చుండూరులో ఆపివేసి ఎవరో నానాభీభత్సం చేసారట. అందుకని వారు పరీక్షకు హాజరు కాలేక పోయినారు. నేను మాత్రం తెనాలి నుంచి గుంటూరుకు కొంచెం ముందుగా బయల్దేరేవాడిని నాకు మార్గంలో పరీక్షలు వ్రాసినంత కాలం ఎలాంటి అసౌకర్యం కల్గలేదు.

ఆడిటింగ్ పేపరెంతో కష్టమనిపించింది. జవాబులేవి తెలియరావటంలేదు. పరీక్ష వ్రాయకపోతే తప్పుతాననే భయం. ఇలాంటి సమయంలో ఆర్తిగా - "శరద్బాబూజీ" గార్ని ప్రార్థించాను. ఈ పరీక్షలో నేను తప్పకుండా "పాస్" కావాలని అంతే తెలిసిన ఆన్సర్ మొదటి పేజిలో వ్రాసాను. అనుకోని విధంగా ఊహించని రీతిలో ఆ పేపర్లో 35/ మార్కులు వచ్చి "పాస్" అయినాను.

ఏమీ వ్రాయలేక పోయిన "నేను" గురువుగార్ని ప్రార్థించినదువల్ల కష్టంగా వున్న పేపర్లో 35% మార్కులు వచ్చేలా చేసారు. నాజీవితంలొ వారిపై మొదటి సారిగా విశ్వాసం కల్గటానికి కారణం 35% మార్కులు రావటం. అప్పటి నుంచి "శరద్గురూజీని" ఏది కోరుకున్నా నా జీవితంలో "ఠక్కున" జరిగిపోతున్నది. ఆశించినదానికన్నా ఎక్కువ ఫలితాన్నే పొందుతున్నాను. ప్రస్తుతం నేను కంప్యూటర్ ఆపరేటర్ గా స్థిరపడినాను

K.V.L. అనిల్ కుమార్
2-5-12. గంటావారి వీధి, నందులపేట - తెనాలి.



## వేచి ఉండాలి

తిరువణ్ణామలైకి వచ్చిన తరువాత "గురూజీ" మధ్యాహ్న సమయంలో మా S.V.L. నారాయణరావుగార్ని, మా సాయి ప్రసాద్ గార్ని, "నన్ను" తమసన్నిధిలో కొంత సమయం గడిపేందుకు దయతో అనుగ్రహించారు. ఏ సమయంలో పిలుస్తారో తెలియదుగదా! ఆ పిలుపుకోసం, ఆ సన్నిధిని అనుభవించటం కోసం, ఆర్తితో, ఆనందంతో, "వేచివుంటే" మంచి ఫలితాన్నిస్తుంది. అందుకని 2 గం|| గురుగృహానికి చేరుకొనేవాళ్ళం. గతంలో గురుదేవులు మధ్యాహ్న సమయంలో ఎవర్ని పిల్చింది లేదు. ఎందుకిలా అవకాశమిచ్చారో తెలిసికోవాలని నా ఊహా ప్రపంచంలోకి విహరించాను. ఏతత్కారణంగా రాత్రి సమయంలో గురూజీ పాశ్చాత్యులతో ఆంగ్ల భాషలో అభిభాషణం చేస్తున్నారు. ఆసముదాయంలో ఆంగ్ల భాష అర్థముకాని వ్యక్తిని నేనేనని ముందే మనవి చేసాను. అందుకని నా అదృష్టం కొలది తెలుగు లో వారి వచనాలను వినే అవకాశాన్ని నాకు ఈ సమయంలొ ఈవిధంగా అనుగ్రహించారనే సమాధానం దొరికి తృప్తిచెందాను. గురూజీది దయార్ద్రతతో గూడిన హృదయంగదా! ఏ ఒక్క మనసు అసంతృప్తితో వారి సన్నిధిని వీడి పోరు. ఇక అసలు విషయానికి వస్తాను.

మ|| 2.30 గం|| గురు గృహానికి నేను వచ్చాను. అప్పటికే S.V.L. గారు సాయిప్రసాద్ గారు అక్కడ వున్నారు. ఆరోజు 6గం|| దాకా మంచి విషయాలు, మేము ముచ్చటించుకొనినాము. S.V.L. గారు ఎంతో చక్కగా గురులీలలను వివరించారు. ప్రతిరోజు 2.30 to 3.00 గం|| మధ్య గురువుగారు పిలిస్తారు. 6గం||లైంది. ఈరోజుగురువుగారు పిలవరని మాసొంత తెలివి తేటలను ప్రకటించుకొని, నేను, సాయి ప్రసాద్ గారు బయటికి వెళదామనుకొన్నాం. గురుహృదయాన్ని బాగా అవగతం చేసికొనిన S.V.L. గారు సూచనా ప్రాయంగా చెప్పినను లక్ష్యపెట్టక కార్లో మేమిద్దరం గిరి ప్రదక్షిణానికి బయలు దేరాము. మేము వెళ్ళిన రెండు నిమిషాలకే గురూజీ

రమ్మన్నారనే విషయాన్ని S.V.L. గారు చెప్పారు. ఆనాటి అనుగ్రహం ఒక్క S.V.L. గారికే దక్కింది. విషయం తెలిసింతరువాత ఇద్దరం బిక్కమొహాలు వేసాము. రాత్రికి అవకాశముంటుందని అనుకున్నాము.

10 గం|| తరువాత గురూజీ అందరికి దర్శనాలనిచ్చారు. అనంతరం పాశ్చాత్యులు గురూజీ తో ప్రత్యేకంగా వ్యక్తిగతంగా మాట్లాడాలని ప్రార్థించారు.వారి ప్రార్థనను దయా హృదయంతో గురూజీ అంగీకరించారు. ఇంకా రాత్రి గురూజీ తో కలసి మాట్లాడుకొనే అవకాశాన్ని మేమిద్దరం కోల్పోయినాము. ఇలా ఎందుకు జరిగిందో లోపమెక్కడుందో తెలియాలి కదా!

గురూజీ సన్నిధిలో ఎక్కువ కాలంగడపాలని వచ్చి గురూజీ కన్నా మరో దానివైపు ఆకర్షితులైన వారికి తగిన రీతిగా గుణపాఠం నేర్పారు. ఆయనలో లేనిది బయటి ప్రపంచంలో మరొకటి మరోరూపంగా ఎలా భాసిస్తుంది. సర్వత్రా నిండిన సద్గురు స్వరూపాన్ని భిన్నంగా చూచినట్లేగదా! నేను తిరగాలని వెళ్ళిన గిరి ఆయనలో లేదా! ఉంటే నేనెందుకు వెళ్ళినట్లు. వెళ్ళిసాధించిందేమిటి! నష్టపోయిందేమిటో తెలిసింది. ఎన్నో జన్మల పుణ్య ఫలముంటే గాని సద్గురు సందర్శనం మనకు లభించదు. సద్గురు చరణాన్ని ఆశ్రయించాలనుకొనే వాడు ఎన్ని గంటలైన ఎన్ని నెలలైనా గురుదర్శనం కోసం ప్రేమగా ఓర్పుతో సహనం తో వేచి ఉండాలేగాని అసహనం కలిగితే ఎంతో నష్టపోతాడు! ఏక్షణాన, ఏసమయాన, ఏ విధంగా గురువు తన సన్నిధికి రప్పించుకుంటారో ఆగురువుకు తప్ప ఇతరులకు తెలియదు. సరిహద్దులోని సైనికునిలా అనుక్షణము ఎదురు చూడవల్సిందే - వేచి ఉండవల్సిందే. ఏమరుపాటు చెందావా అనుగ్రహానికి దూరమైనట్లే! ప్రతిక్షణం ఆ అనుగ్రహం కావాలని పరితపించాలి. ఎప్పటి కప్పటికది కొత్త అనుభూతిగానే, రసాస్వాదనంగానే ఉంటుంది. అదే గురుకృప.



నమస్కారములతో
గురుచరణదాసుడు.

## విశ్వసించిన వారికి విచారమే లేదు

నేను మొట్టమొదట 1996 February తిరుమలలో గురువుగారిని దర్శనం చేసుకొన్నాను. మొదటి రోజు గురువుగారి దర్శనానికి వెళ్ళినప్పుడు నాకు ఆరోగ్యం బాగుండటం లేదండి అని చెప్పినాను. గురువుగారు "ఊదీ" ఇచ్చారు. మరలా రెండవ రోజు దర్శనానికి వెళ్ళినప్పుడు ఇంత మందిలో నేను చెప్పింది గురువుగారికి గుర్తుండదేమో అని మళ్ళీ అదే సమస్య చెప్పాను. అప్పుడు గురువుగారు చెప్పావు కదమ్మ అని మరలా "ఊదీ" పెట్టినారు. అంతకు ముందు 20 రోజులకొకసారి జ్వరం వచ్చేది. గురువుగారికి చెప్పి వచ్చిన దగ్గరనుండి జ్వరం నా దగ్గరకే రాలేదు. మా అబ్బాయికి ఆరోగ్యం సరిగా ఉండేది కాదు. ఎంతో మంది డాక్టర్లకి చూపించి ఎన్నో మందులు వాడాము. అన్ని ప్రయత్నాలు చేసాము. కానీ ఏ మాత్రం తేడా కనిపించలేదు. మా అబ్బాయిని తీసుకొని 1998 April లో గురువుగారు Hyderabad వచ్చినప్పుడు వెళ్ళినాను. తరువాత గురుపూర్ణిమకు వెళ్ళాము. ఇంటి దగ్గర ఎప్పుడూ నీరసంగా ఉంది అని పడుకొనే పిల్లవాడు అక్కడకు వెళ్ళగానే చక్కగా తిరుగుతూ ప్రదక్షిణలు చేస్తూ ఉంటే చూచి నేను ఆశ్చర్యపోయినాను. గురువుగారికి మా అబ్బాయి ఆరోగ్యం గురించి చెప్పి తిరిగి బయలు దేరి వస్తూ ఉంటే అంతకు ముందు ఎంతో బరువుగా ఉన్న హృదయం చాలా తేలిక పడిపోయింది. ఇంటికి రాగానే మా అబ్బాయి ఆరోగ్యం బాగైనది. ఇంతకు ముందు ఎప్పుడూ పడుకొనే ఉండేవాడు. ఇప్పుడు చక్కగా తిరుగుతూ, పని చేస్తూ ఉన్నాడు. ఈ మార్పుకి చుట్టుప్రక్కల వాళ్ళందరూ ఆశ్చర్యపోయినారు.

పెమ్మసాని రుక్మిణమ్మ, బుర్రిపాలెం.

# నేను చూసిన నా గురువు గారి యొక్క అపూర్వశక్తి

నా పేరు S. మోహనరావు గుప్తా, గుంటూరు నివాసిని. దాదాపు ఆగష్టు, 1992 నెలయందు షిర్డిలో కొన్ని రోజులు (మా సాయి పథం ఆశ్రమములో) గురువుగారితో ఉండుట జరిగినది. ఆ రోజులలో జరిగిన ఒక ఆశ్చర్యమైన సంఘటన మీ కందరికీ తెలుపవలెనని కోరిక కలిగి తెలియపరుచుచున్నాను.

ఒక రోజు మధ్యాహ్నము దాదాపు 3గంటల సమయమున సంస్థాన్ హోమియో డాక్టరు బాక్లీవాలా వద్ద నుంచి Phone Call వచ్చినది. ఆ ఫోను నేను రిసీవ్ చేసికొనినాను. వారు మా గురువుగార్రైన డా|| సాయినాథుని శరత్ బాబుగారికి Phone ఇవ్వమని వారితో మాటలాడాలని అన్నారు. వారితో మా గురువుగారు మాటలాడి సాకోరి మాతాజిగారు మన ఆశ్రమానికి వస్తున్నారట అని చెప్పినారు. నాకు తెలిసిన విషయము ఈ సాకోరి మాతాజి (గోదావరి మాతగారు సమాధి చెందినాక మాతాజీగా ప్రకటితమైన మాత) ఎక్కడికి వెళ్ళరు. వారు ఆశ్రమము దాటివెళ్ళినట్లుగా ఎన్నడూ చూడలేదు. అలాంటివారు మా ఆశ్రమానికి రావటం గొప్పవిశేషముగా నేను భావించినాను. దాదాపు సాయంత్రం 4గంటలకు వారందరూ అనగా మాతాజీతో పాటు ఆంధ్రాకు చెందిన మరి ఇద్దరు కన్యలు ఇంకొక మరాఠీ కన్య మొత్తము నల్గురు వచ్చినారు. గురువుగారికి ఎదురుగా కార్పెట్ మీద అందరూ ఆసీనులైనారు. వారు ఎక్కడకు రారు, మరియు ఎవరి చేతి మీదగా ఏమి ఇచ్చినా తాగరు. అలాంటి వారు మా గురుపత్ని (మా అమ్మగారు) ఇచ్చిన మంచి తీర్థము మరియు బోర్నవీటా పుచ్చుకున్నారు. సాకోరి మాతాజీకి తన చిన్న వయస్సు నుండి కడుపునొప్పితో బాధపడుచున్నట్లుగా, ఆబాధ నివారణకు హోమియో మెడిసిన్ కు వారివద్దకు వచ్చినట్లు చెప్పినారు. మాతాజి వయస్సు 60దాకా ఉండవచ్చు. వారి వ్యాధికి సంబంధించిన విషయాలు పూర్తిగా తెలుసుకొని గురువుగారు వారికి హోమియో మందు ఇచ్చి ఏవిధంగా వాడాలో తెలిపినారు. వారు కూడా మాపూజ్యగురుదేవులకు నమస్కరించి మెడిసిన్స్ తీసుకొని వెళ్ళినారు.


ఒకవారం రోజుల తరువాత సాకోరి మాతాజీ వద్ద నుంచి మా గురువు గారి పేరు మీద లెటరు వచ్చినది. ఆ లెటరు విప్పిచూడగా అది మరాఠీలో వ్రాయబడి ఉన్నది. మాకెవరికీ మరాఠీ రాదు. అందుకని మా ఆశ్రమము ప్రక్కనే ఉన్న మరాఠీ వార్రైన భరత్ గారిని పిలిచినాము. మా గురువుగారు భరత్ గారికి ఆ మాతాజీ వ్రాసిన లెటరు ఇచ్చి దానిలో వ్రాసిన విషయమును అంతా తెలియపరచమన్నారు. భరత్ గారు ఆ లెటరు చదివి దానిలోని మాతాజీ వ్రాసిన ఆశ్చర్యకరమైన సంగతి చెప్పినారు. అది ఏమనగా "మీవద్ద కూర్చొని మెడిసిన్ తీసుకొని వెళ్ళినప్పటి నుంచి నాకు చిన్న వయస్సులో నుంచి ఉన్న కడుపునొప్పి పోయినది. ఈ లెటరు వ్రాసేరోజు వరకు కూడా మీరు ఇచ్చిన మెడిసిన్ ఇంకా వాడుట మొదలు పెట్టలేదు. ఇంకొన్ని రోజులలో మా సాకోరి ఆశ్రమములో జరుగనున్న యాగానికి నేను ఎక్కువ గంటలసేపు కూర్చొని వేదపఠనము చేయవలసిన పనికి, నాకు శక్తిని ప్రసాదించవలసినది. ఆరోజున మీ ఎదురుగా కూర్చొని మీతో మాటలాడినపుడు నాకు మీరూపంలో ఆ షిరిడి సాయినాథుడే అగుపడుతూ ఉన్నాడు" అని వ్రాసినారు. వీరి ఆశ్రమానికి వెళ్ళిన వారందరూ వారియెదుట సాష్టాంగ నమస్కారము చేస్తారు. అంతటి గొప్ప మాతాజీకి మా గురువుగారి దర్శనంతో వారికి చిన్నప్పటి నుంచి ఉన్న కడుపునొప్పి పోవటం, వారు మా గురువుగారి స్థానంలో బాబాదర్శనం పూర్తిసమయము (వారు గురువుగారి ఎదురుగా ఉన్నంతసేపు) చేయుటం నాకు మామూలు విషయముగా తోచలేదు. కనుక ఈ సందర్భమునుబట్టి నాపూజ్య గురువు అయిన డా|| సాయినాథుని శరత్ బాబు గారి అద్భుతశక్తి తెలుసుకొన్నాను. వారికి సదా నమస్కరించుచున్నాను.

Ch. మోహనగుప్తా - గుంటూరు.

# ఆ చేయి ఎంత హాయి

భాగము II

ఏ మహనీయునియందు అద్భుతములైన గుణములకు ఆలవాలమై విరాజిల్లునో, అటువంటి వారిని దర్శించినంత మాత్రానే సరిపోదు, ఆదివ్యపురుషుని, లోకమాన్యుని గుణాద్భుతంబైన విశేషాంశములను వర్ణించగలేని కవిజన్మ వ్యర్థము. సాధకుడైన వాని యొక్క వాగ్జన్మయు నిరర్థకమే యగును. నక్షత్రాధీశుడు శంకరుని జటా కిరీటాలంకారమై భాసిల్లుచున్నాడు. అటువంటి అమృత కిరణుని సౌకుమార్యము ఈరూపమందు దృగ్గోచరమగుచున్నది. అమృతోత్పత్తికి మూలస్థానమైన పయోనిధానమే ఆమహనీయుని గాంభీర్యము. విశ్వ విశ్వంభరాంభోజ కర్ణికాయ మానంబగు మేరునగము ఆ పురుషోత్తముని ధైర్యము. విభ్రమ భ్రూలతా భంగ లీలా విజిత సుమనస్నాయక విలాస రేఖాసారంబై నిర్వికారంబైన ఇంతటి అపురూపాకారంబు మానవ రూపధారియందు సంభవమా? ఎవ్వరి యందైనను, మున్నెన్నడైనను సాధ్యపడినదా? అట్టి లోకోత్తరుని దర్శించిన వారెల్లరు ధన్యులే. పిలివకయే పలకరించి,అడగకయే అలరించి, తలవకయే తరింపచేయుటకు అరుదెంచిన ఆ మానవోత్తముని ఎన్నెన్ని సార్లు పొగడినను తనివితీరదాయే. ఎంతగా స్తుతించినను తృప్తి కలుగదాయె.నాకు శక్తి లేక పోయెనయ్యోయని కుయ్యాలించి చింతాక్రాంతుడనైతిని. అయినను ఈ నేత్రములు అదృష్టము చేసినొని ఫలవంతములాయెను. ఈ కరములు పుణ్యమార్జించినవి. ఈ శరీరము పులకించినది వీనులు భాగ్యవంతములు కానున్నవి ఆ మహనీయుని ఉదంత శ్రవణాపేక్షకై కుతూహలపడుచున్నవి.



జలధర తిరోధానంబు వాసినం ప్రకాశించు హిమధాముని లా! సంశయములను విచ్ఛిన్నముచేయు ఆకరుణామయుని వదనము చిరునవ్వు నవ్వుతు, అభయహస్తమును మరోమారు నాసెత్తము పైనిధిగా తెలియని అనుభూతి నన్నావరించినది. నా శరీరం నానుండి వేరై పోతున్నట్లుగా తలంపులు. తేలికై పోతున్నది తనవు. నా కూర్చము వంగి పోతున్నది. నా ఆబపై రెప్పలువాలినవి. మాట పెగలడములేదు. నాస్థితి ఏమిటో నాకు తెలియదు. సంపెంగ వాసనకు మత్తెక్కిన భృంగమ్ములాగా మైమరచి పోతున్నాను. మైకంలో ఉన్నాను.

ఆ మహనీయుని పంచశాఖ శిరము పై నుంచి పయనించి పెన్నంటినది. రక్షణ లభించినది ధైర్యము కల్గినది. అప్రయత్నంగా అంఘ్రిద్వయముపై వాలిపోయి శిరము వంచాను. తృప్తి కలిగేంతవరకు నా మేనును నిమరుతున్నారు. నిమిరిన కరాలను ముద్దాడినాను. ప్రతి చేష్టకు ఓ వింత అనుభూతి సంతరించుకుంటున్నది నా మనస్సులో.....

ఉద్ధరించే నిమిత్తమై సూటిగా కళ్ళలోకి చూచి ఆ విద్యావరణ దోష కారణంగా నిన్ను కలవరపర్చిన ప్రశ్నలేమిటి? నీవు తెలుసుకోవాలనుకొనేది ఏమిటి? నిర్భీతుడవై అడగవలసినదని ఆసద్గురు మూర్తి తన గురు రూపమైన "బాబా" కు పలు మారులు వందనములాచరించినారు.

ఇంతటి మహదవకాశము నాకు కల్గించుటకు మూల కారణంబైన బాబాకు శతవిధాల నమస్కరించుకొని తన ప్రతి బింబరూపమే అన్యము కాదను భావన నాకు స్పష్టపరిచిన బాబా రూపానికి భిన్నము కాని నా గురుదేవునకు మనసారా నమస్కరించి, పాదములపై కరముంచి మీ అనుమతితో అడుగుచున్నాను. నా సంశయములను తొలగించగలరు. బాహ్యదృష్టికి ఇవి హాస్యములన్పించవచ్చు. అంతమాత్రాన వాటిని తేలిక చేయవలదని మనవి. నా ఆనందము నాదిగాని ఇంకెవ్వరిదీ కాదుగదా?

నా అనుభూతులు నావి. నా సంశయములునావి. మన ఇర్వురకే సంబంధించినవి. అవి మీతో ముడిపడి వున్నవని నాభావనను విశదపరచి గురుదేవా యని సంబోధించి అడగడము ప్రారంభించినాను.

ప్రశ్న - నేనెందుకు వేంకటగిరికి వచ్చాను?

జవాబు - ఇందులో నీ ప్రమేయమేమీలేదు. నీరాజకీయ పలుకుబడి, నీ తెలివి తేటలు ఎంత మాత్రం కాదు. ఉద్యోగపు మిషతో ఇక్కడకు వచ్చావు.

ప్రశ్న - ఉదయగిరి, వినుకొండ, సూళ్ళూరుపేట, నాయుడుపేట, మాచర్ల, ప్రాంతాలలో అవకాశమున్నా నేను "వేంకటగిరికే" రావాల్సిన అవసరమేమున్నది?

జవాబు - ఎంతదూరాన ఉన్నా నాభక్తుణ్ణి పిచ్చుక కాలికి దారమేసిలాక్కొస్తాననే మాట నీవు ఇంకా వినలేదు. "బాబా" నిన్ను ఇక్కడకు పంపాలని అనుకున్నారు. అందుకనే అలా జరిగింది.

ప్రశ్న - నన్నే ఇక్కడకు ఎందుకు పంపాలి.

జవాబు - ఏకాంతంగా ఆలోచించు నీకే సమాధానం దొరుకుతుంది.
ఇక్కడకు రావటానికి ముందు నీవు 30 సం||రాలుగా "బాబా" సన్నిధిలో ఉన్నావు. నీవు తిన్న తిండి, కట్టిన వస్త్రము, అన్నీ ఆయన దయా విశేషంగా నీకు లభించాయి. నీతాత, తండ్రి, కూడా ఆయన సన్నిధిలో ఉన్నవాళ్ళే. 30సం||రాల నీజీవితంలో ఆలోచనా శక్తి పెరిగిన తరువాతైనా నీ ఈ అభివృద్ధికి కారణమెవరో, ఎవరు నిన్నితకాలం కంటికి రెప్పలా కాపాడుకుంటూవచ్చారో ఒక్కరోజైనా యోచించావా? 30సం||రాల కాలంలో ఆయన సన్నిధిలో ఉన్నావన్న పేరేగాని, జీవితకాలంలో ఏనాడైనా "బాబా" ఎవరు? తెలుసుకోవాలనే ఆలోచన నీకు తట్టిందా! నీకింతకాలంగా అన్న పానీయాదులిచ్చి పోషించిన మహోదారుని దాతృత్వం పైన లేశమైనా కృతజ్ఞతాభావం చూపావా? నీ దొడ్లోగడ్డితిని, ప్రక్కవాడి ఇంటిలో పాలిచ్చే ఆవును నీవేమంటావు? ప్రస్తుతం ఇప్పటి దాకా నీవు చేసిందదేనేమో ఆలోచించు. తిండి పెట్టిన విశ్వాసంతో "శునకం" యజమానిని అంటి పెట్టుకొని ఉంటుంది. నీలోలవలేశమైన ఆ భావన లేదాయే?

నీకు వచ్చిన ఈ ప్రభుత్వోద్యోగం నీ మార్కులు, అర్హతలను బట్టి రాలేదు. నీకంటె మించిన మేధావులున్నా నీకీ ఉద్యోగం వచ్చింది. కనీసం వచ్చిననాడైనా నీ హృదయంలో "బాబా సన్నిధిలో అంతకాలమున్నవాడు ఉస్సురనుచు ఉండరాదని దయదలచి నీకు ఓ మంచి మార్గాన్ని బాబా చూపారనే" తలంపురాలేదు. బాబా చేసిన లీలలు జాగ్రత్తతా పరిశీలన చేస్తే, ఇది నేనే నీకోసమేచేసానని తెలియపర్చుతారు.

ప్ర|| నన్ను వేంకటగిరికే ఎందుకు తీసికొని రావాలి? మరోచోటికి పంపి ఆయనలీలలలను నాకు వ్యక్తం చేయవచ్చును గదా?

జ|| 'బాబా' తెలియజేయదల్చినప్పుడు ఎక్కడైనా తెలియజేయగలరు. నీ ఈ నాటకరంగానికి "వెంకటగిరి" రంగస్థలమైతే బాగుంటుందని ఇక్కడి పాత్రలైతే బాగుంటాయని, నీ పాత్రకు రాణింపు ఇక్కడ నుండి ఆరంబం కావాలని "బాబా" తలంచారు. ఇప్పుడీ విషయాలు నీకు అర్థంకాక పోయినా మున్ముందు తప్పకుండా తెలుస్తుంది. నిన్నెందుకు వేంకటగిరికి పంపారో! ఎందుకు నీవు వచ్చావో! ఎవరివలన నీవు ఏవిధంగా మారిపోయావో, మొ|| విషయాలన్నీ తెలుస్తాయి. తెలిసేట్టుగా బాబా చేస్తారు.

ప్ర : నేను 1984 సం|| వరకు "బాబా" భక్తుణ్ణి కాను, ఆరాధించిన వాణ్ణి కాదు. అలాంటి నన్ను ఆయన దరిచేర్చుకోవాల్సిన అవసరమేముంది?

జ : ప్రయత్న పూర్వకంగా బాబాకు భక్తులుగా ఎవ్వరూ కాలేరు. ఆ ఋణాను బంధాన్ని నీవు గుర్తించలేవు. తన దగ్గరికి తన వారిద్వారా రప్పించుకుంటారు.

ప్ర : నేను "బాబా" వైపుకు మళ్ళటానికి మీరు కారకులౌతారా!?

జ : నేనెలా చెప్పగలను. బాబా సంకల్ప "మేమైతే" అదే జరుగుతుంది.

ప్ర : నేను మీరు కారణమని అనుకుంటున్నాను?

జ: అది నీ భావన అని నేననుకొంటాను

ప్ర ; మీ ద్వారా నాకు బాబా పరిచయమైనారని నా దృఢ విశ్వాసం?

వచ్చే సంచికలో గురుదేవులు బాబాపై చెప్పిన కొన్ని విషయాలు వివరణకు వస్తాయి.

డా|| జి. సాయివరప్రసాదరావు, రేపల్లె.

## మా ఇంట్లో భజనచెయ్యరూ!

మా ఇంట్లో భజన చేయండని తరచుగా గురుబంధువులు అడుగుతుంటారు. మన పరిసరాలలో జరిగే సత్సంగాలు, నిర్వహిస్తున్న కార్యక్రమాలను తిలకించటమే కారణంగా గురుబంధువులు అలా అడగటానికి కారణం కావచ్చు.

నేడు సాయి భజనలు అసంఖ్యాకంగా జరుగుతున్నాయి. వివిధ రకాలుగా, ఎవరికి తోచినరీతిన వారు నేడు బాబాని సేవించుకుంటున్నారు. ఎవరి విధానాన్నీ విమర్శించడం ఈ వ్యాసం యొక్క ఉద్దేశము కాదు. కాని మనం చూచినది, మనకు తెల్సినది ఇతరులకు పంచడం ద్వారా కొన్ని విషయాలను అందరము తెలుసుకోవడం జరుగుతుంది.

ఈ రోజున దేవాలయాలలో జరుగుతున్న బాబా భజనల జోలికి మనం వెళ్ళడంలేదు. మరి వీటి గురించి మనం ఆలోచించేకంటే ప్రత్యేకంగా, మన గురు బంధువుల, వారి మిత్రుల ఇళ్ళల్లో జరిగే భజలను గూర్చి చర్చించుకొందాము.


వాస్తవానికి మనం ఎవరిని నమ్ముకున్నాం? ఎలా నమ్ముకున్నాం? వారి మార్గమేమిటి? వారి వద్దకు మనమెలా చేర్చబడ్డాం? చేరింతరువాత మనం తెలుసుకున్నదేమిటి? తెలుసుకున్న దానిని ఎంతవరకు ఆచరిస్తున్నాం? మొదలగు విషయాలపై మనకుగా మనమే విమర్శించుకోవాలి.

మనమంతా గురుబంధువులమని అనుకుంటున్నాం. అలానే పిలిపించుకుంటున్నాం. మన మార్గం, మన విధానం, మనం చేసే ప్రతిపని చూచే వారికి అడగకుండానే, మనం చెప్పకుండానే తెలిసేట్టుగా ఉండాలంటే మనం ఆదర్శవంతమైన ఆచరణ మార్గంలో పయనిస్తూ ఉండాలి కదా! చెప్పే మాటలను మనం చేతలద్వారా చూపించగలిగినప్పుడు బలవంతంగా మన భావాలను వారిపై రుద్దే పనే లేదుగదా! ఆ రోజుల్లో బాబా ఇది చెయ్యి, అది చెయ్యి, అని వాచా ఎవరికి బోధించలేదు. వారి చర్యలే ఎందరికో మార్గదర్శకములైనాయి.

అదే విధంగా మన గురుబంధువుల ప్రతి చర్య ఒకరినుంచి ఇంకొకరికి సందేశముగా ఉండాలి. ఒకే దైవం, ఒకే ధ్యానం, ఒకే ధ్యేయంగా ఉండాలనేదే గురూజీ సందేశం. ఈ ప్రకారంగా మనం ఆచరిస్తే మన ఆచరణే క్రొత్త వారికి మార్గదర్శకత్వం కాగలదు. గురుదేవుల బోధ, బోధపడగలదు.

మన గురుబంధువుల ఇళ్ళల్లో జరిగే బాబా భజన ఒక ఆదర్శవంతమైన రీతిలో ఉండాలి. మన సత్సంగ కేంద్రముల వరకు ఒకే దైవం అనగానే బాబానే మనకు గుర్తుకు వచ్చేది. "గురూజీ" మార్గంలో పయనిస్తున్న మనందరం బాబా ప్రక్కన గురుదేవులనుంచి సమానంగా పూజిస్తున్నాం. అనన్యంగా సేవిస్తున్నాం.

మన ఇంట్లో భజన జరిపే రోజున ఎందరో గురుబంధువులు వస్తారు. వారు రాగానే వారందరికి మన ఇంట్లో అనేక దేవతామూర్తుల ఫోటోలు దర్శనమిస్తాయి. కొందరు బాబా భజనకు రమ్మని ఆహ్వానిస్తారు. ఆ భజనలో పూర్వీకుల నుండే ఆచారంగా వస్తున్న దేవతామూర్తులను ప్రక్క నుంచే సరికి వారు విస్తుపోతారు. మనం చెప్పిందే మిటో చేస్తున్నదే మిటో తెలియక వారు తికమక పడతారు.



ఎంతో కాలంగా ఉన్న వాటిని తొలగించటానికి సందేహిస్తాం. ప్రతిక్షణం బాబాను తలుస్తున్న మన మనస్సుతోపాటు, చూపుకు కూడా బాబానే కన్పించేట్లుగా ఉంటే ఎంతో బాగుంటుందిగదా!

పని, చూపు, మనస్సు ఈ మూడు ఒకే దైవం పైన కేంద్రీకరించి గురుదేవుల మార్గంలో పయనిస్తుంటే మనకెప్పుడు ఏది అవసరమో అప్పుడది తప్పక తీరుస్తారు. సాయిపథగాములుగా ఎదగటానికి ఇదే ఉత్తమమైన మార్గం.

గట్టా రత్తయ్య, తెనాలి,

## గురువుగారికి తెలియందే ముంది!

నా పేరు పువ్వల రామమోహనరావు. నేను తెనాలి వెస్ట్ సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో S.Aగా పని చేయుచున్నాను. గత 13 సంవత్సరములుగా తెనాలిలోనే కాపురముంటున్నాము. ప్రతిరోజు ఉదయం శ్రీసాయిబాబా గుడికి వెళ్ళిన తరువాత మాత్రమే ఆఫీసుకు వెళ్తాను. మా ఇంట్లో ప్రతి ఆదివారం శ్రీసాయినాథుని శరత్ బాబూజీ వారి సాయి సత్సంగం 3 గంటలకు జరుగుతుంది. శ్రీసాయి మా కుల దైవం. నేను వారిని తాతగారుగా పిలుస్తాను. నాకు అనేక సందర్భాలలో చేదోడు వాదోడుగా ఉంటున్నారు శ్రీసాయిబాబా. "26-4-1992"వ తేదీ నేను షిర్డీ వెళ్ళినాను. అంతకు ముందు షిర్డీ చాలాసార్లు వెళ్ళాను కాని అప్పుడు నాకు ప్రమోషన్ వచ్చినది. తెనాలిలో పోస్టు వేసినారు. 1-5-1996న తెనాలిలోనే ఆఫీసులో జాయిన్ కావాలి. ఆ సందర్భంలో షిర్డీ వెళ్ళినాను. షిర్డీలో శ్రీసాయినాథుని శరత్ బాబుగారిని కలుసుకొనుటకు నా భార్య పిల్లలతో కలసి 3 గంటలకు వెళ్ళినాము. మేము వచ్చినట్లు అక్కడ సాయిభక్తులు గుప్త గారితో కబురు చేసినాను. కొద్ది సేపటికి గురూజీ లోపలకు రమ్మని పిలిచినారు. మేము లోపలకి వెళ్ళినాము. మా గురించి వివరములు అడిగి తెనాలి నుండి వచ్చినామని చెప్పినాము. గురూజీ చాలా సంతోషముతో తెనాలిలో సత్సంగము ఎలా జరుగుతున్నది? నరసింహారావుగారిని, సాయి వరప్రసాదుగారిని అడిగి కుశలములను తెలుసుకున్నారు. అప్పుడు గురూజీ మరాఠీ నుండి సాయి చరిత్రను


యథాతథంగా తెలుగులోనికి అనువాదము చేయుచున్నారు. అందులో మార్పులు చేర్పులు చూస్తు వున్నారు. అప్పుడు పని ముగించి భోజనము చేసి మమ్ములను పిలిచినారు. మా బాబు ఇంటర్ పాస్ అయినాడని చెప్పినాము. మా బాబుని గురూజీ అక్కడ ఉండమని వాడికి కావలసిన కోచింగ్ ఇస్తామని చెప్పినారు. ఇంకా కొంతమంది పిల్లలు అక్కడ ఉండి చదువుకొనుచున్నారు కాని మేము మా బాబుని ఎప్పుడు వదలి ఉండకపోవటము వలన అక్కడ ఉంచలేక పోయినాము. నాకు ఆరోగ్యము బాగుగా లేదని చెప్పినాను. అప్పుడు నాకు గురూజీ మందులు ఇస్తూ ప్రతిసారి నా వద్దకు వచ్చి మందులు తీసుకొని వెళ్ళుట కష్టము కనుక గుంటూరులో డా||నరేంద్ర వద్ద మందులు వాడుకొనుము. వారికి కావలసిన సలహాలు నేను ఇస్తాను అని చెప్పినారు. మేము చాలా విషయములు గురించి గురూజీని అడిగి తెలుసుకున్నాము. 2 గంటలు పైగా మాతో మాట్లాడారు. మీకు వసతి లేనిచో ఆశ్రమములోనే ఉండామన్నారు. షిర్డీలో చూడవలసిన ప్రదేశములు, చేయవలసిన పూజా విధానములు గురించి వివరించి రాత్రి 12 గంటల తరువాత "గురుస్థానం"లో ప్రదక్షిణలు చేయమని చెప్పినారు. అన్ని ప్రదేశములు చూపుటకు గుప్తాగారిని మాతో పంపినారు. వారు ఎంతో ప్రేమతో మాకు అన్ని ప్రదేశములు చూపించినారు. తరువాత మేము గురూజీ దగ్గరకు వెళ్ళినాము. మేము ఇక్కడ 3 రోజులు ఉండాలి అని అనుకున్నామని చెప్పినాము. 1-5-96న నేను కొత్త ఆఫీసులో జాయిన్ కావాలని చెప్పినాను. గురూజీ మీరు ఈ రోజునే బయలుదేరి వెళ్ళమని చెప్పినారు. గురూజీ చెప్పినట్లు తిరుగు ప్రయాణము అయినాము. బస్సులో రిజర్వేషన్ దొరకలేదు. అన్ని సీట్లు అయిపోయినవని చెప్పినారు. ఎలా తిరిగి వెళ్ళాలో తెలియలేదు. గురూజీ చెప్పినట్లు జరుగుతుంది. గురూజీ మీద నమ్మకముతో బస్సు డిపోకు బయలుదేరినాము. ఇంకా నాతో 10 మంది వచ్చినారు. హైదరాబాద్ బస్సు ఏదో వచ్చినది. బస్సు ఆపి డ్రైవరుతో, కండక్టరుతో రిజర్వేషన్ అయిపోయినది, సీట్లు లేవని చెప్పినారు. మీరు ఎలాగయినా మమ్ములను తీసికొని వెళ్ళవలసినది అని అడిగినాము. వారు సీట్లు ఉన్నవి. మీరు బస్సు ఎక్కండి తీసికొని వెళతామని చెప్పినారు. బస్సు అంతా ఖాళీగానే ఉన్నది. అందరము హైదరాబాద్ వచ్చినాము 100 రూపాయలు బస్సు కండక్టరుకు ఇచ్చినాము కాని ఆయన మాకు వద్దని తీసుకొనలేదు. ఇంకా 3 రోజులు ఉన్నది కదా అని హైదరాబాదులో ఉందామని అనుకొన్నాము. కాని గురూజీ చెప్పినట్లు వెంటనే వెళ్ళాలి. సరే అని అక్కడ మా I.S ఆఫీసుకు వెళ్ళినాము. A.I.H. ప్రసాదరావుగారిని కలిసినాము. ఆయన మీకు ట్రాన్స్ ఫర్లు ఆపమని ఆర్డరు పంపినాము. ఇప్పుడు ఏమీ తొందరలేదు. 4రోజులు ఇక్కడ ఉండి వెళ్ళమని చెప్పినారు. ఆర్డరు మాకు చూపించలేదు. కానీ నేను గురూజీ వెంటనే వెళ్ళమని చెప్పినారు కదాని గురూజీ మీద నమ్మకంతో నేను వెంటనే బయలుదేరినాను. నేను తెనాలి వచ్చేసరికి నాకు తెనాలికి బదులు రేపల్లెకు ప్రమోషన్ మీద ట్రాన్స్ ఫర్ చేసినారు. ఆరోజు నేను రేపల్లెలో జాయిన్ కావాలని ఆర్డర్స్ వచ్చివున్నవి. ఇలా ఎట్లా జరిగింది? ట్రాన్స్ ఫర్లు ఆపమని ఆర్డర్స్ వచ్చినవి కదా! అని తెలుసుకొనగా 21-4-92కు ముందు తేదీతో ట్రాన్స్ ఫర్ చేసినారు. ఎక్కడ ఏమిజరుగుతుందో గురూజీ శ్రీసాయినాథుని శరత్ బాబూజీకి అంతా తెలుసు. వారి మాట మీద నమ్మకంతో ఆగకుండా తిరిగివచ్చుట వలన వెంటనే ఆఫీసులో జాయిన్ కాగలిగినాను. అంతా శ్రీ సాయినాథుని శరత్ బాబూజీ కృప.

పువ్వుల రామమోహనరావు, తెనాలి.

## గురుసన్నిధిలో ఆనందమైన రోజు

ఎల్లవేళలా బాబా ఆశీస్సులు అందరికి లభిస్తుంటాయని తరుచుగా గురువుగారంటారు. కాని బాబా ఆశీర్వాదమును మీరు గుర్తించలేరంటారు. అదే విధంగా మనందరిపై మన గురువుగారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉన్నప్పటికి వాటిని మనం కూడా గుర్తించలేమని తెలియచెప్పే అనుభవం నా జీవితంలో జరిగింది. 'గురుకృప' పత్రిక ద్వారా ఆ అనుభవాన్ని తెలియచేస్తున్నాను.

గురూజీ తిరుపతిలో ఉన్నప్పుడు వారి దర్శనానికి మేము అంటే మా అక్క చెల్లెళ్ళము ముగ్గురం ఫ్యామిలీలతో పిల్లలను తీసుకొని తిరుపతి వెళ్ళాము. ఆరోజు మధ్యాహ్నం సత్సంగం చేస్తున్న సమయంలో అందరినీ వారి వారి అనుభవాలు చెప్పమన్నారు. అందరూ చెపుతున్నారు. నేను చెప్పుకోతగ్గ అనుభవం ఏమీ గ్రహించలేక పోయాను. నేను అసలు ఎందుకు వస్తున్నాను? అసలు సార్ దృష్టిలో నేను ఉన్నానా? అని ఎంతో బాధపడ్డాను. ఈసారి మంచి అనుభవం జరిగితే బాగుండునని గురువుగారికి నమస్కరించుకొన్నాను. ఆశ్చర్యమేమంటే ఆమరుసటి రోజు ఉగాది పండుగ. ఆరోజు ఉదయం గురువుగారు, నారాయణరావుగారు, రాధాకృష్ణగారు, ఇవాన్ వాళ్ళు ఇంకా కొందరు గురువుగారు నిర్ణయించిన 3కార్లలో బయలుదేరుతున్నారు. అదే సమయానికి మేము తోమాలసేవ చూసుకొని వస్తు వాళ్ళకు ఎదురుపడ్డాము. మమ్ములను చూసి గురువుగారు వస్తే మీరు కూడా రండి అని చెప్పటంతో మేము ఆరుగురం శివరాం గారి కారులో సార్ కారు వెనకాల చక్కగా నామం చెప్పుకుంటూ బయలుదేరాం. సారును తృప్తిగా చూస్తూ సుమారు 3గంటలు అన్నీ చూసి సారుతో గడిపే అవకాశం దొరికింది. రిటన్ లో ఒక గార్డెన్ లో కూర్చున్నాం. అందరం తీసుకెళ్ళిన బిస్కెట్లు స్వీట్లు అందరికి నేనే పంచిపెట్టాను. "అందరికి ఇస్తున్నావు నీవు తీసుకోలేదు నీవు తీసుకో" అని గురువుగారు ఎంతో గుర్తింపుగా అడగటం నాకెంతో సంతోషం కలిగించింది. నాకు అలా సారుతో ఒక చిన్న పిక్నిక్ లాగా ఎంతో సంతోషంగా గడిపే అవకాశం రావటం మరచిపోలేని అనుభవంగా గుర్తుండిపోయింది. ఆరోజు మధ్యాహ్నం గురువుగారి దగ్గర పర్సనల్ గా దర్శనం లేదు. కానీ మా మూడు ఫ్యామిలీస్ని సార్ రమ్మంటున్నారు అని కబురు వచ్చింది. మేము ఆరుగురం మా పిల్లలతో లోపలికి వెళ్ళాము. ఆరోజు గురువుగారు ఎప్పుడూ మాట్లాడని విధంగా ఎంతో అపురూపంగా మా ప్రాబ్లమ్స్ గురించి మాట్లాడి ఓదార్పుగా "మిమ్మల్ని నేను వదిలేస్తాను అని ఎందుకు అనుకున్నారు? మీ బాధ్యత నాది కాదా" అని ఎంతో ఆదరంగా మాట్లాడారు. సుమారు 1గంట సేపు మా పిల్లలతో సారు సన్నిధిలో ఒక కుటుంబ సభ్యుల లాగా మాట్లాడుతూ గడపటం మరిచిపోలేని అనుభవం నాకు జరిగింది. నూతన సంవత్సరము రోజు సార్ దృష్టిలో మేము ఉన్నాము. ఇక దేనికి భయపడక్కరలేదు, మా పగ్గాలు సార్ చేతిలో ఉన్నాయి అనే ధైర్యం, సంతోషం, మాకు మంచిరోజులు వస్తున్నాయి అనే పూర్తి విశ్వాసం కలిగాయి. ఈ విధంగా తిరుపతి ట్రిప్ మరచిపోలేని మంచి అనుభవంగా మిగిలిపోయింది.



గ్రంధి పద్మజ శివయ్య, విజయవాడ.

*గురు నెన్నడును మానవ మాత్రునిగా తలంపరాదు*

*సద్గురు కటాక్షము నొందువారు ధన్యాత్ములు, గురువు సంసార తరణోపాయమును జూపుచు సమస్త విఘ్నములను దొలగించును. గురువచనములందు గాఢ విశ్వాసమును బూని, శ్రద్ధా భక్తులతో వాని యుపదేశముల నవలంబింపుము. మనోమాలిన్యము క్షాళితమై జ్ఞాన తేజ ముదయించును. గురుని యందు శ్రద్ధా భక్తులు గలవానికి శీఘ్రముగా జ్ఞానోదయమగును. కాని గురుని భగవత్స్వరూపునిగా గననేర్వవలయును. గురు నెన్నడును మానవ మాత్రునిగా దలపరాదు*

*"బ్రహ్మానందవాణి"*